వలసజీవుల బతుకు పోరాటం

- వ్యవసాయ పనిముట్ల తయారీలో నిమగ్నం
- పలు ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని విక్రయాలు

కోవూరు : కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన వలసజీవులు. ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లను తయారుచేసి ఉపాధి పొందుతున్నారు. మధ్యప్రదేశ్ నుంచి మూడు కుటుంబాలు కోవూరు మండల కేంద్రంలోని నేతాజీనగర్‌లో వ్యవసాయ పనిముట్లను తయారు చేసి రైతులు, ఇతరులకు అమ్ముతున్నారు. కేవలం వ్యవసాయ పనిముట్లకే పరిమితం కాకుండా వరికోసే సమయంలో టార్పాలిన్ పట్టలను అద్దెకు ఇస్తున్నారు. వరిపైరు కోతకు వచ్చే సమయంలో పనిముట్ల విక్రయాలు జోరందుకుంటాయి. వారంతా జిల్లాలోని పలు ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని తాత్కాలికంగా పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు.

అందరూ కష్టపడితేనే..

వలస వచ్చిన వీరంతా కావల్సిన డబ్బును సంపాదించుకునేందుకు కుటుంబమంతా కలిసి కట్టుగా పనిచేస్తారు. మహిళలు కొలిమి వేసి పాత ఇనుము కాలిస్తే పురుషులు సమ్మిట వేస్తూ వస్తువులు తయారుచేస్తుంటారు. గొడ్డలి, కొడవలి, కత్తులు, గడ్డపారలు, పారలు, సమ్మిట వంటి రకరకాల వ్యవసాయ పనిముట్లతో పాటు ఇంటికి అవసరమైన పనిముట్లు తయారు చేస్తున్నారు. పెద్దలు తయారుచేసిన వస్తువులను చిన్నారులు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తూ బతుకు పోరాటం చేస్తున్నారు. ఎక్కడ వరికోతలు ప్రారంభమైతే అక్కడ ఈ పనిముట్లు అమ్మేందుకు బయలుదేరి పోతుంటారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పనిముట్లు


సమ్మెట పనులు చేస్తున్న కార్మికుడు

జీవనోపాధి కోసం..



మా ప్రాంతంలో పంటలు సక్రమంగా పండకపోవడంతోనే జీవనోపాధి కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నాం. మా పెద్దలు నుంచి వ్యవసాయ పనిముట్లను తయారు చేసే పనులు నేర్చుకున్నాం. చేసిన వస్తువులను రైతులకు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాం. సుమారు నెల రోజులు పాటు ఇక్కడ రైతులకు అందుబాటులో ఉంటూ పనిముట్లు తయారుచేస్తాం.

– రాజాసింగ్, వలస కూలీ

పని సులువు అవుతుంది

గతంలో మాదిరిగా గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారు కరువయ్యారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారంతా అక్కడక్కడా టెంట్లు వేసి వ్యవసాయ పనిముట్లు తయారుచేస్తున్నారు. వాటిని కొనుగోలు చేసి మాకు పనికొచ్చే విధంగా ఉపయోగించుకొంటున్నాం. కోతల సమయంలో టార్పాలిన్ పట్టలు కూడా అద్దెకు తీసుకొని నురుపులు అయిన తరువాత ఇస్తున్నాం.

– మణి, రైతు, పడుగుపాడు

చిత్తశుద్ధితో పనిచేస్తే అధికారం మనదే


మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- గృహసారథులకు మంత్రి కాకాణి దిశా నిర్దేశం

పొదలకూరు : గృహసారథులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తే మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తి పంచాయతీలో ఉన్న వృద్ధాశ్రమ కల్యాణ మండపంలో మంగళవారం చివరి రోజున గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొని, వారికి దశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాల్సిందిగా సూచించారు. పార్టీలకు అతీతంగా అమలవుతున్న పథకాల గురించి ఓర్పు, నేర్పుతో ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడాను వివరిస్తూ ఆధారాలను చూపాల్సిందిగా పేర్కొన్నారు. కరుడుగట్టిన టీడీపీ వాదులు కస్సుబుస్సులాడినా పట్టించుకోవద్దని, వారి కుటుంబ సభ్యులకు అందిన సంక్షేమ ఫలాల గురించి లెక్కలతో సహా వివరిస్తే వారు కూడా వాస్తవాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. గృహసారథులు పార్టీ బ్యాగులు తగిలించుకుని ఇళ్లకు వెళ్లడం చిన్నతనంగా భావించవద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేసేందుకు వెళ్తున్నామన్న భావన మనస్సులో కలగాలన్నారు.


సదస్సుకు హాజరైన గృహసారథులు, కన్వీనర్లు

చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి

చంద్రబాబును సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలని ఒక వర్గం మీడియా తీవ్రంగా ప్రయత్నిస్తోందని గృహసారథులు బాబు వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు వివరించాల్సిందిగా మంత్రి కాకాణి సూచించారు. ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా పచ్చమీడియా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిపారు. దీనిని కూడా గృహసారథులు పరిశీలించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలన్నారు. మార్చి 20వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగి పని ప్రారంభించాల్సిందిగా పేర్కొన్నారు. సదస్సులో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, తాటిపర్తి ఉపసర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, నాయకులు పలుకూరు పోలిరెడ్డి, పి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి గరుడసేవ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం రాత్రి గరుడసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని మోహినీ అవతారంలో కొలువుదీర్చి గిన్నెభిక్ష నిర్వహించారు. అనంతరం రాత్రికి గరుడ వాహనంపై కొలువైన స్వామివారిని గ్రామోత్సవానికి తరలించారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పందిళ్లపల్లి శ్రీరాములరెడ్డి–వెంకటరమణమ్మ, గణేశం శ్రీనివాసులురెడ్డి–సుజాత, సనికంటి గురుమూర్తి–పరమేశ్వరి, ఆదూరు శ్రీనివాసులు, ఆదూరు సుమన్–శివజ్యోతి, సందీప్ వ్యవహరించారు.

ఘనంగా వసంతోత్సవం


గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు వసంతోత్సవం మంగళవారం వేడుకగా నిర్వహించారు. తొలుత త్రిశూల స్నానం జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లకు పారువేట ఉత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశ్వవాహనంపై కొలువైన దేవదేవేరులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చివరిగా గ్రామోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు సర్వబొట్ల హరిప్రసాద్, బండారు సుబ్రమణ్యం స్వామి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బండి శాంతయ్య, నిర్వాహక కమిటీ సభ్యులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, పెనాక శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వడ్డిపాళెం రోడ్డుకు మహర్దశ


వడ్డిపాళేనికి వేస్తున్న సీసీరోడ్డు

ముత్తుకూరు : మండలంలోని పిడతాపోలూరు పంచాయతీలో వడ్డిపాళేనికి ఎంతో కాలంగా గుంతలమయమైన మెటల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు భారీ ఊరట లభించింది. పిడతాపోలూరు రోడ్డు నుంచి వడ్డిపాళెం మీదుగా కట్టకింద వడ్డిపాళెం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ, సుమారు రూ.35 లక్షల వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. దాదాపు 350 మీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో రోడ్డుకు మహర్దశ పట్టిందని చెప్పారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కోవూరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. అనంతరం అధ్యాపకులు ప్రిన్సిపల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌ప్రసాద్, మేరిగ మధుసూదన్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం

బుచ్చిరెడ్డిపాళెం : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుచ్చి పట్టణంలో కూరగాయల మార్కెట్, పండ్ల దుకాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు బుట్టల్లో కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయాలని కోరారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

పొదలకూరు : బీసీల అభివృద్ధిని ఎన్నికల నినాదంగా కాకుండా విధానంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు రుణపడి ఉన్నారని మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు వెల్లడించారు. పొదలకూరులో మంగళవారం సంఘ అధ్యక్షుడు వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీల ఎన్నికల్లో బీసీలకు సీఎం పెద్దపీట వేసినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో 48 మందిని శాసనమండలికి పంపితే వారిలో 30 మంది ఓసీలు ఉన్నట్లు గుర్తుచేశారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలు 18 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనికి భిన్నంగా సీఎం జగన్ 68.18 శాతం ఎమ్మెల్సీలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కోసం కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీనివాసులు, పముజుల శంకరయ్య, నాయకులు సోమా భాస్కరరావు, రాధాకృష్ణ, ఎస్‌కే అంజాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ సంఘ నేతలు

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

విరువూరులో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం

పొదలకూరు : మండలంలోని విరువూరులో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. మండలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తొలిసారిగా విరువూరు సచివాలయ పరిధిలోనే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో సచివాలయ నిధుల కింద రూ.20 లక్షలను గడపగడపలో గుర్తించిన పనులకు నిధులు మంజూరయ్యాయి. గ్రామంలోని జొన్నమిట్టకాలనీ, ప్రగతినగర్, గ్రామంలో మాజీ సర్పంచ్, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రెయిన్ల నిర్మాణం పూర్తైంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వల్ల డ్రెయిన్ల సమస్య తీరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి కాకాణికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.


పూర్తయిన సైడ్‌డ్రెయిన్లు

ఎన్జీఓ మహిళా కమిటీ ఎన్నిక

పొదలకూరు : పొదలకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ మహిళా కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. అధ్యక్షురాలిగా కె.సుశీల, సహాధ్యక్షులుగా కె.అనసూయ, ఉపాధ్యక్షులుగా జె.సుధారాణి, కె.నాగభూషణమ్మ, టి.సంధ్య, సీహెచ్ విద్యుల్లత, ఎస్.వెంకటరమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే కరిముస్నీసా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌కే సోనీ, సహాయ కార్యదర్శులుగా వి.సుప్రజ, ఎం.రమణమ్మ, పి.రాజు, వి.కృష్ణవేణి, సీహెచ్ హైమావతి, ట్రెజరర్‌గా ఎస్.మునిరాధికలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షురాలు ఈ.కరుణమ్మ వ్యవహరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మధు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ జి.వరలక్ష్మి, జిల్లా మహిళా చైర్‌పర్సన్ యు.చినమ్మ, పొదలకూరు తాలూకా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.చిరంజీవి, జిల్లా సహాధ్యక్షుడు ఆంజనేయవర్మ పాల్గొన్నారు.


నూతన కమిటీని అభినందిస్తున్న అధికారులు

బాలికల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

కోవూరు : రాష్ట్రంలో ఏ ఒక్క బాలికకు అన్యాయం జరగకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని తీసుకొచ్చారని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. కోవూరు సీఐ కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడారు. కోవూరు మండలానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడిపై పోక్సో కేసు పెట్టారన్నారు. బాలికల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం


ఇందుకూరుపేట : డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు


కోవూరు : రీసర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా జరుపుతున్న రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో జరిగిన రీ సర్వే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హరనాథ్, వీఆర్వో వెంకటలక్ష్మి, స్థానిక నేతలు పంబాల జనార్ధన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, మారుబోయిన సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాళెంలో..

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెంలో భూముల రీసర్వేను డిప్యూటీ తహసీల్దార్ గీతాదేవి, సర్పంచ్ నలుబోలు శ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో రోవర్ ద్వారా సర్వే చేసి భవిష్యత్‌లో రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా హద్దు రాళ్లను నాటుతున్నట్లు వెల్లడించారు. పోతిరెడ్డిపాళెంలో నెల రోజుల పాటు రీసర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.శ్రీనివాసులురెడ్డి, సహాయ సర్వేయర్ అశోక్, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పని దినాలు పెంచాలి

కోవూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ మృధుల కోరారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు కూలీలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరూ వేసవి తాపానికి గురి కాకుండా తాగునీటి వసతులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ శ్రీహరి పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న ఏపీడీ మృధుల

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

- సర్వేపల్లి జోన్ గ్రిగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం సర్వేపల్లి జోన్ 98వ గ్రిగ్ మెమోరియల్ క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి క్రీడా జెండాను ఆవిష్కరించగా, విశ్రాంత ఉపాధ్యాయుడు జి.తిరుపాల్‌రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్ల శేషారెడ్డి దాతృత్వంతో సర్వేపల్లి జోన్ గ్రిగ్ క్రీడాపోటీలను మహ్మదాపురం దొడ్ల సుబ్బారెడ్డి జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని హైస్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. తొలిరోజున స్పోర్ట్స్‌కు సంబంధించి బాల, బాలికల విభాగంలో సీనియర్స్, జూనియర్స్‌కు 1,200, 800, 200, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విరువూరు, తాటిపర్తి, పొదలకూరు హెచ్‌ఎంలు పద్మజాకుమారి, నాగమోహన్‌రెడ్డి, సనత్‌కుమార్, సీహెచ్ రామకృష్ణయ్య, వార్డెన్లు దేవకుమార్, శివకుమార్, పూర్వ విద్యార్థి రాఘవాచారి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల పీఈటీ విజయ్‌విశ్వేశ్వరన్ పాల్గొన్నారు.


క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి

విజేతలు వీరే..

సీనియర్స్ బాలుర విభాగంలో ఎం.రవీంద్ర(జెడ్పీహెచ్‌ఎస్, మహ్మదాపురం, 25 పాయింట్లు), సీనియర్స్ బాలికల విభాగంలో వి.హేమలత(చైతన్య స్కూల్, పొదలకూరు, 21 పాయింట్లు), జూనియర్స్ బాలుర విభాగంలో పి.కల్యాణ్ చక్రవర్తి(సీవీఆర్ స్కూల్, ముత్తుకూరు, 15 పాయింట్లు), జూనియర్స్ బాలికల విభాగంలో జి.విజయలక్ష్మి(జెడ్పీహెచ్‌ఎస్, తోడేరు, 13 పాయింట్లు) సాధించారు. రెండోరోజు బుధవారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలు నిర్వహిస్తామని హెచ్‌ఎం రామకృష్ణయ్య వెల్లడించారు.

గ్రిగ్ టోర్నీలో బహుమతుల పంట

ముత్తుకూరు : గ్రిగ్ మెమోరియల్ టోర్నీలో పాల్గొన్న ముత్తుకూరు అదానీ విద్యామందిర్(సీవీఆర్ హైస్కూల్) పలు బహుమతులు వచ్చాయని హెచ్‌ఎం శ్రీనివాసరావు చెప్పారు. అథ్లెటిక్స్ అండర్–17, 14 పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా, 20 మంది బహుమతులు పొందారని తెలిపారు. వంద మీటర్ల బాలుర రన్నింగ్‌రేస్‌లో 1, 2 స్థానాలు, 200 మీటర్లలో 1, 2 స్థానాలు, 400 మీటర్లలో 1, 3 స్థానాలు దక్కించుకున్నారన్నారు. లాంగ్ జంప్, షాట్‌పుట్‌లలో ప్రథమ స్థానం, రిలే జూనియర్స్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు.


ముత్తుకూరు : టోర్నీలో పాల్గొన్న అదానీ విద్యామందిర్ విద్యార్థులు


పోటీలకు హాజరైన వివిధ మండలాల క్రీడాకారులు

పెరిగిన బ్రహ్మోత్సవ రాబడి

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవ రాబడి స్వల్పంగా పెరిగింది. గతేడాదితో పోల్చుకుంటే రూ.50 వేలు అధికంగా వచ్చింది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.14,15,286లు రాగా, గతేడాది రూ.13,65,250లు వచ్చింది. ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. స్వామివారి దర్శన టిక్కెట్‌ల ద్వారా రూ.3,26,505లు, హుండీ ద్వారా రూ.2,13,869లు, వేలం ద్వారా రూ.8,60,150లు, కల్యాణం చదివింపులు రూ.5,912ల వంతున రాబడి వచ్చిందని ఈఓ బి.శాంతయ్య తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ చిట్టిబాబు, ఆలయ ట్రస్టీలు శేషురెడ్డి, ఎ.వెంకటరమణమ్మ, ఆలయ అర్చకులు డి.సుబ్రమణ్యం, నిర్వాహక కమిటీ సభ్యులు ఆర్.రాజేష్‌రెడ్డి, బి.వెంకటనగేష్‌నాయుడు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపు కార్యక్రమం